క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ బైక్‌ ర్యాలీ

అమలాపురం టౌన్‌: ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి సోమవారంతో నాలుగేళ్లు పూర్తవుతున్న శుభ సందర్భంగా అమలాపురంలో నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ శ్రేణులతో బైక్‌ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు ఈ ర్యాలీ జరుగుతుందన్నారు. అమలాపురం సమీపంలో మంత్రి విశ్వరూప్‌ ఇంటి వద్ద నుంచి బైక్‌ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. నియోజకవర్గంలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మున్సిపల్‌ కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని బులినాని విజ్ఞప్తి చేశారు.

పరిశోధన పత్రాల సమర్పణ



అమలాపురం టౌన్‌: స్థానిక యేడిద సత్యనారాయణ (ఏఎస్‌ఎన్‌) పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మంగళపల్లి అరుణ్‌కుమార్‌ గుజరాత్‌ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన ఐఐఎం సదస్సులో రెండు పరిశోధన పత్రాలు సమర్పించారు. 'ఇంపార్టెన్స్‌ ఆఫ్‌ హెల్త్‌ ఇన్‌స్రూ పోస్ట్‌ కోవిడ్‌-19', 'ఆర్థిక సమస్యలు- విపులీకరణ' అనే రెండు అంశాలపై పరిశోధన పత్రాలను అందించారు. ఈ పత్రాలను గుర్తించిన సదస్సు నిర్వాహకులు డాక్టర్‌ అరుణ్‌కుమార్‌ను అభినందించారు. అలాగే గత ఏప్రిల్‌ 26న హంకాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మేనేజ్‌మెంట్‌, ఉన్నత విద్యా రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'ఎమర్జింగ్‌ ఎడ్యు-లీడర్‌ ఆఫ్‌ ఆసియా' పురస్కారాన్ని ప్రకటించి గౌరవించింది. ఈ పురస్కారాన్ని అహ్మదాబాద్‌ సదస్సు వేదికపై అందుకున్నారు. ఈ వివరాలను ఆదివారం స్థానికంగా డాక్టర్‌ అరుణ్‌కుమార్‌ ఓ ప్రకటనలో తెలిపారు.

చిత్రలేఖనం పోటీలు

తాళ్లరేవు: వేసవి వినోదం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో నిర్వహిస్తున్న సమ్మర్‌ క్యాంప్‌లో సత్యసాయి పబ్లిక్‌ స్కూల్‌ ఉపాధ్యాయులు తణుకు రాంబాబు, కర్నీడి వెంకట రమణ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గుత్తుల మల్లేశ్వరరావు, పాలిక శ్రీనివాస్‌, అత్తిలి బాబూరావు, టి.ఈశ్వరరావు తదితరులు క్యాంపును సందర్శించి విద్యార్థినీ విద్యార్థులకు అల్పాహారం అందించారు.

అఖండ హోమం



హోమం చేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్‌: స్థానిక విద్యుత్‌నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో జేష్ట శుద్ధ అష్టమి ధూమావతి అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా శనివారం ఉదయం అఖండ హోమం ప్రారంభమైంది. ఆదివారం మధ్యాహ్నం ఆ హోమం పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా జరిగింది. తూము సత్యనారాయణ కుటుంబీకులు హోమకర్తలుగా వ్యవహరించారు. అక్షయపాత్ర సంస్థ సేవకులు తూము దొరబాబు, వాసు, లత, చిట్టిబాబు, మణి, చాగంటి ప్రసాద్‌, పోతురాజు నాగకనకదుర్గ, అరిగెల బుజ్జి, నూకల కుమారి, ప్రసాద్‌ తదితరులు హోమానికి సేవలు అందించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళాలు



మురమళ్లలో అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న జీవన్‌కుమార్‌

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు ఆదివారం విరాళాలు సమర్పించారు. తిరుపతికి చెందిన వరికూటి జీవన్‌కుమార్‌ రూ.10,116, విజయనగరానికి చెందిన పొగరు సుందరరామలక్ష్మి రూ.10 వేలను ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావు, అర్చకుడు ఉండి దత్తుశర్మకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

బోగస్‌ ఓట్లను తొలగించాలి

యానాం: నియోజకవర్గంలో బోగస్‌ ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ కేంద్ర హోం శాఖ కార్యదర్శికి లేఖ రాసినట్లు దరియాలతిప్ప విలేజ్‌ హెడ్‌మెన్స్‌ ఆర్గనైజేషన్‌ జనరల్‌ సెక్రటరీ సబ్బతి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 3,400 బోగస్‌ ఓట్లను 2022 డిసెంబర్‌లో ఎన్నికల శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి గుర్తించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌, యానాంలలో రెండు చోట్ల ఓట్లు నమోదై వీరంతా ఉన్నారన్నారు. రెండు చోట్లా ఓట్లు నమోదైన పేర్లను సివిల్‌ సప్లయిస్‌ శాఖ రేషన్‌ కార్డులలో తొలగించిందన్నారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలో కూడా తొలగించాలని కోరారు.

వడివడిగా అడుగులు

- అమలాపురంలో అగ్నిమాపక కేంద్ర భవనం
- అసంపూర్తి నిర్మాణం పూర్తికి చర్యలు



అమలాపురం వడ్డిగూడెంలో నిర్మించిన అగ్నిమాపక కేంద్ర భవనం

అమలాపురం టౌన్‌: ఎండాకాలం మండే కాలం.. ఈ సమయంలోనే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. ప్రమాదాల సమయంలో నష్ట నివారణకు అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది చొరవ ఎనలేనిది. అలాంటి అగ్నిమాపక కేంద్ర భవనాన్ని జిల్లా కేంద్రం అమలాపురంలో అందుబాటులోకి తెచ్చేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. స్థానిక వడ్డిగూడెం శివారులో 70 సెంట్ల మున్సిపల్‌ స్థలంలో గత టీడీపీ హయాంలో అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అప్పట్లో అరకొర నిధులు కేటాయించడంతో భవన నిర్మాణం మాత్రమే పూర్తయింది. ఆ భవన పరిసర ప్రాంతంలో ఖాళీ స్థలం దాదాపు నాలుగు అడుగుల మేర ఎత్తు చేయాల్సి ఉంది. అలాగే భవనానికి, వడ్డిగూడెం ప్రధాన రోడ్డును అనుసంధానం చేస్తూ మార్గం నిర్మించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు పనులను గత టీడీపీ ప్రభుత్వం విస్మరించింది. ప్రస్తుతం భవన ప్రాంగణం లోతట్టుతో ఉండి పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది. ఈ పనులను పూర్తి చేసేందుకు ప్రస్తుతం వడివడిగా అడుగులు పడుతున్నాయి.

రూ.30 లక్షలు అవసరం

ఈ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం ఐదేళ్ల కిందట అగ్నిమాపక శాఖ ద్వారా రూ.70 లక్షల నిధులు విడుదల చేసింది. ఆ నిధులతో భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇక మట్టి, రోడ్డు పనులకు నిధులు కేటాయిస్తేనే ఆ భవనం నూరు శాతం అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం అమలాపురం అగ్నిమాపక కేంద్రం స్థానిక నల్ల వంతెన దిగువన ఎక్సైజ్‌ స్టేషన్‌కు ఎదురుగా సొంత భవనంలోనే ఉంది. కొత్తగా డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా ఏర్పాటయ్యాక జిల్లా అగ్నిమాపక కేంద్రాన్ని ఈ భవనంలోకి తేవాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రస్తుతానికి జిల్లా కేంద్ర కార్యాలయాన్ని ముమ్మిడివరంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇప్పుడున్న సొంత భవనాన్ని జిల్లా భవనంగా మార్చిన తర్వాత అమలాపురం అగ్నిమాపక కేంద్రాన్ని వడ్డిగూడెంలో కొత్తగా నిర్మించిన భవనంలోకి మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఈ పెండింగ్‌ పనుల పూర్తికి అధికారులు తగిన చర్యలు చేపట్టారు. దీనికి అవసరమైన నిధుల మంజూరుకు మంత్రి పినిపే విశ్వరూప్‌ చొరవ తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని దాదాపు 110 గ్రామాలకు పైగా ఈ అగ్నిమాపక కేంద్రం ద్వారా సేవలు అందుతున్నాయి. అందుకే దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు



వడ్డిగూడెంలో అమలాపురం అగ్నిమాపక కేంద్రానికి భవనం దాదాపు పూర్తయింది. ఎర్త్‌ ఫిల్లింగ్‌, అప్రోచ్‌ రోడ్డు పనులు పూర్తయితే కేంద్రాన్ని అక్కడకు మార్చుతాం. ఈ పెండింగ్‌ పనులను త్వరగా పూర్తి చేసేందుకు తమ శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే ప్రస్తుతం ఉన్న సొంత భవనం ఖాళీ చేసి జిల్లా కేంద్ర భవనంగా అప్పగిస్తాం.

–కేవీ మురళీ కొండబాబు, అగ్నిమాపక దళాధికారి, అమలాపురం

అంబేడ్కర్‌ ఆశయ సాధనకు కృషి



చల్లపల్లిలో అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్‌ తదితరులు

ఉప్పలగుప్తం: అంబేడ్కర్‌ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ అన్నారు. చల్లపల్లి అంబేడ్కర్‌ నగర్‌లో నిర్వహించిన అంబేడ్కర్‌ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వరూప్‌ మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేడ్కర్‌ తన మేధాశక్తితో రాజ్యాంగాన్ని రచించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ మాట్లాడుతూ అంటరానితనాన్ని అరికట్టిన ఘనత అంబేడ్కర్‌కు దక్కుతుందన్నారు. అంబేడ్కర్‌ ప్రజా సంక్షేమ సంఘం తరఫున ఇంటర్‌, పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందించారు. అనంతరం చినగాడవిల్లి బీరవారిపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్‌ విగ్రహాన్ని మంత్రి విశ్వరూప్‌, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచులు బద్రి బాబ్జి, ఇసుకపట్ల జయమణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, భోగిశెట్టి నరసింగరావు, బడుగు మేరీ కుమారి, ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబూరావు, పెయ్యిల శ్రీనివాసరావు, గెడ్డం సురేష్‌ బాబు, నాతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



అమలాపురం శిబిరంలో ఓ రోగికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అమలాపురం టౌన్‌: పట్టణానికి చెందిన సామాజిక కార్యక్రమాల నిర్వాహకుడు నల్లా శ్రీధర్‌ సౌజన్యంతో హైదరాబాద్‌ ఏషియన్‌ వాస్క్యులర్‌ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో స్థానిక నల్లావీధిలో రక్తనాళ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. హైదరాబాద్‌ హాస్పిటల్‌ నుంచి వచ్చిన వైద్య నిపుణులు దాదాపు 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. అంతేకాకుండా రక్తనాళ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. తమను హైదరాబాద్‌ నుంచి తీసుకువచ్చి ఉచిత వైద్యం శిబిరం నిర్వహించిన నల్లా శ్రీధర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరాన్ని జనసేన పార్టీ నాయకుడు డీఎంఆర్‌ శేఖర్‌ ప్రారంభించారు. మున్సిపల్‌ కౌన్సిల్‌ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, కౌన్సిలర్‌ పడాల శ్రీదేవి, ఆర్డీఎస్‌ ప్రసాద్‌, నల్లా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన



సదస్సును ప్రారంభిస్తున్న కిమ్స్‌ డీన్‌ డాక్టర్‌ ఆనంద్‌ఆచార్య

అమలాపురం రూరల్‌: స్థానిక కిమ్స్‌ మెడికల్‌ కళాశాలలో ఇంటర్‌ బైపీసీ చదివిన విద్యార్థులకు వైద్య విద్య, ఉపాధి అవకాశాలపై ఆదివారం సదస్సు నిర్వహించారు. కిమ్స్‌ డీన్‌ డాక్టర్‌ ఆనంద్‌ ఆచార్య, ఉపాధ్యక్షుడు మోహనరాజు, ఫోరెన్సిక్‌ విభాగ అధ్యక్షుడు ప్రొఫెసర్‌ డాక్టర్‌ గొలకోటి రంగారావు పలు అంశాలను వివరించారు. దంత వైద్యుడు కార్తికేయన్‌, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.అశోక్‌ చక్రవర్తి, నర్సింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ స్వప్నకుమారి, పారా మెడికల్‌ కాలేజీ వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఫరీద్‌ బాబు, కిమ్స్‌ మానవ వనరుల విభాగం జనరల్‌ మేనేజర్‌ రాధా మనోహర్‌ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. మెడికల్‌, డెంటల్‌, ఫిజియోథెరపీ, నర్సింగ్‌ పారామెడికల్‌ డిగ్రీ, డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి గల అవకాశాలు, అనంతరం ఉద్యోగ అవకాశాల గురించి ఆయా రంగాల నిపుణులు వివరించారు. 150 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో కిమ్స్‌ సీఏఓ రఘు, చైర్మన్‌ కేవీవీ సత్యనారాయణరాజు, ఎండీ రవికిరణ్‌వర్మ పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సన్మానం

తాళ్లరేవు: స్థానికంగా వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. తాళ్లరేవు దేవీమహల్‌ సెంటర్‌లోని సూర్యభాస్కర కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లకు పురస్కారాలు అందించి సత్కరిస్తారన్నారు. దీనికి ప్రజాప్రతినిధులు, వలంటీర్లు తదితరులు హాజరుకావాలని కోరారు.

బాలబాలాజీకి రూ.1.38 లక్షల ఆదాయం



వాడపల్లిలో స్వామి వారికి అష్టోత్తర పూజలు



ర్యాలిలో దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి ఆదివారం వివిధ సేవల ద్వారా రూ.1.38 లక్షల ఆదాయం వచ్చింది. దర్శనం టికెట్ల విక్రయం, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.89,295 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.49,637 చెల్లించారు. 2,186 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 1,674 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. హైదరాబాద్‌కు చెందిన గంటి వీరభాస్కరశర్మ, సుభద్ర దంపతులు స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.13,060 విరాళం ఇచ్చారు. ఏటా ఆగస్టు 15న తమ పెళ్లి రోజు సందర్భంగా అన్నదానం జరిపించే విధంగా దాతలు ఈ విరాళం అందించారు. దాత కుటుంబానికి ట్రస్టు బోర్డు చైర్మన్‌ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు స్వామి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందించారు. ఆలయ ఈఓ డి.శ్రీరామవరప్రసాదరావు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి ఆదివారం ఆలయ అవరణలో అష్టోత్తర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఏడు శని వారాల నోము ఆచరించిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు ఈ పూజలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్‌ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠకు విరాళం

పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి ఉమాకమండలేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠకు హైదరాబాద్‌కు చెందిన నల్లాని చక్రవర్తుల విజయకుమార్‌ రూ.15,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ జాతర

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామదేవత మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, బాణాసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కనుల పండుగగా జరిపించారు. అమ్మవారికి సోమవారం భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. జాతర మహోత్సవాల సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ ఎత్తున విద్యుత్‌ అలంకరణలు ఏర్పాటు చేశారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించండి

అంబాజీపేట: మాచవరం శివాలయం సమీపాన ఇసుకపూడి వెళ్లే ప్రధాన రహదారిలో గత మూడు రోజులుగా విద్యుత్‌ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో ఇళ్లలోని ఫ్యాన్లు తిరగడం లేదని, విద్యుత్‌ బల్బులు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉక్కపోతకు గురవుతున్న వృద్ధులు, వికలాంగులు, చిన్నారులు లోవోల్టేజీ సమస్య వల్ల రేయిబవళ్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. విద్యుత్‌ ట్రాన్స్‌ఫారం వల్ల లోవోల్టేజ్‌ సమస్య వస్తుందని సంబంధిత లైన్‌మన్‌కు తెలియపరచినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు బహిరంగంగా విమర్శించారు. తక్షణమే లోవోల్టేజ్‌ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును కోరారు. లోవోల్టేజీ సమస్యపై విద్యుత్‌ శాఖ అధికారులతో చర్చించి తక్షణమే పరిష్కరించే చర్యలు తీసుకుంటామని స్థానికులకు ఎమ్మెల్యే వివరించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామ శివారు బాడిలంకలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. పేకాడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.68 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఎస్‌.శ్రీధర్‌ ఆదేశాల మేరకు నగరం ఎస్సై షేక్‌ జానీబాషా, రాజోలు ఎస్సై పృథ్వీ ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడి చేసి జూదరులను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నారు.

పర్యావరణ హిత జీవన శైలిని ఆవిష్కరిద్దాం



గ్రంథాలయంలో విద్యార్థులతో వికాస సంస్థ జిల్లా మేనేజర్‌ రమేష్‌ తదితరులు

అమలాపురం టౌన్‌: అమలాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జరుగుతున్న వేసవి ఉచిత శిక్షణా శిబిరంలో పర్యావరణ హిత జీవన శైలిపై నిపుణులు ఆదివారం అవగాహన కల్పించారు. కలెక్టర్‌ హిమాన్షు శుక్లా ఆదేశాలతో విద్యార్థులకు పర్యావరణంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించామని గ్రంథాలయ నిర్వాహకుడు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా వికాస సంస్థ మేనేజర్‌ జి.రమేష్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పర్యావరణ హిత జీవన శైలిని ఆవిష్కరిద్దామన్నారు. శక్తి వనరులను పొదుపుగా వాడడం, నీటిని బాధ్యతగా వినియోగించడం, ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్‌ వస్తువుల జోలికి వెళ్లకపోవడం, ఎలక్ట్రానిక్‌ వ్యర్థాలను తగ్గించడం, సమతుల్య ఆహార అలవాట్లు పాటించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఆధ్యాత్మిక సాధనతో దైవానుగ్రహం



ఆధ్యాత్మిక శిబిరంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌

అల్లవరం: ముక్తి సాధనకు తొమ్మిది భక్తి మార్గాలు ఉన్నాయని, ఏదో ఒక దానిని ఎంచుకుని నిత్యం ఆధ్యాత్మిక సాధన చేస్తే దైవానుగ్రహాన్ని పొందవచ్చని తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక కోఆర్డినేటర్‌ ఆర్‌.అనిల్‌కుమార్‌ అన్నారు. కొమరగిరిపట్నం శ్రీప్రహ్లాద బాబా తోటల పండరి ఆశ్రమంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఆధ్యాత్మిక సాధన శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. తొలుత అమలాపురం జోనల్‌ కన్వీనర్‌ జి.ప్రభాకర్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనిల్‌కుమార్‌ మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో ఆనందమయ జీవితాన్ని గడపవచ్చన్నారు. డాక్టర్‌ కాసిన ప్రభాకర్‌ ధ్యానం, సుప్రభాతం, నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ప్రహ్లాదబాబా ఆశ్రమంలో పలువురు ఆధ్యాత్మికతపై ఉపన్యాసాలు చేశారు. రేగళ్ల అనిల్‌కుమార్‌, డాక్టర్‌ డీఎస్‌డీ శ్యామల, కస్తూరి భాస్కరప్రసాద్‌, అక్కిరాజు శ్రీనివాస్‌, రంగయ్య మాస్టారు, వివేకానందరెడ్డి, కాకినాడ జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ గోవిందరాజులు, కస్తూరి రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

ఈదురు గాలులు.. నేలకొరిగిన చెట్లు



కనకాలపేట గణపతినగర్‌లో విద్యుత్‌ తీగలపై పడిన కొబ్బరి చెట్టు

ఉప్పలగుప్తం: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు వీచాయి. ఎస్‌.యానం గ్రామంలో మెయిన్‌ రోడ్డుపై భారీ వృక్షం నేలకొరిగింది. అది విద్యుత్‌ తీగలపై పడింది. అటుగా రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. అలాగే పలుచోట్ల విద్యుత్‌ స్తంభాలు పడిపోయాయి. కొబ్బరి చెట్లు విరిగి పడ్డాయి. మధ్యాహ్నం వరకు తీవ్ర వడగాల్పులతో భానుడి ప్రతాపం చూపించి సాయంత్రం వేళలో చల్లటి గాలులు వీయటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

యానాం: నియోజకవర్గ పరిధిలో వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల కొబ్బరి చెట్లు పడిపోయాయి. అదేవిధంగా విద్యుత్‌ తీగలు తెగిపడడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. ముఖ్యంగా కనకాలపేట గణపతినగర్‌లో కొబ్బరి చెట్లు విద్యుత్‌ తీగలపై పడ్డాయి. యానాం వెటర్నరీ ఆస్పత్రి వద్ద చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్‌ తీగలు తెగిపోయాయి. ఆ శాఖ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

వాలీబాల్‌ టోర్నీ విజేత జి.వేమవరం జట్టు



జి.వేమవరం వాలీబాల్‌ జట్టుకు బహుమతి అందజేస్తున్న నూకరాజు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కేఎన్‌ఆర్‌ వాలీబాల్‌ టోర్నీలో జి.వేమవరం జట్టు విజేతగా నిలిచింది. సోషల్‌ వర్కర్‌ కర్రి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో 13 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం హోరాహోరీగా జరిగిన పోటీలలో జి.వేమవరం ప్రథమ, పెదవలసల జట్టు ద్వితీయ, చినవలసల జట్టు తృతీయ స్థానాలను సాధించాయి. విజేత జి.వేమవరం జట్టుకు కర్రి నూకరాజు కప్‌తో పాటు, వాలీబాల్‌ నెట్‌, మూడు బాల్స్‌, రూ.మూడు వేల నగదును అందజేశారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు పంపిణీ చేశారు. స్థానిక యూత్‌ సభ్యులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుగా పురస్కారం



సుమన్‌ వర్మకు అవార్డు అందిస్తున్న ఏఈపీ సింగ్‌ తదితరులు

అమలాపురం రూరల్‌: అమలాపురం లయన్స్‌ క్లబ్‌ ద్వారా అందించిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక మల్టిపుల్‌ ఉత్తమ అధ్యక్ష అప్రిసియేషన్‌ అవార్డును పట్టణ క్లబ్‌ అధ్యక్షుడు జంపన సుమన్‌వర్మ అందుకున్నారు. ఆదివారం మల్టిపుల్‌ కౌన్సిల్‌ చైర్‌పర్సన్‌ లయన్‌ అనిల్‌కుమార్‌ జైన్‌ ఆధ్వర్యంలో భీమవరంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు ఇంటర్నేషనల్‌ థర్డ్‌ వైస్‌ ఉపాధ్యక్షుడు లయన్‌ ఏఈపీ సింగ్‌, 3వ ఇంటర్నేషనల్‌ అధ్యక్షుడు ఎండర్సీ, విజయ్‌ కుమార్‌రాజు, ఇంటర్నేషనల్‌ డైరెక్టర్‌ చిగురుపాటి వరప్రసాద్‌లు సుమన్‌వర్మకు అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. ఆయన్ని లయన్స్‌ క్లబ్‌ సభ్యులు అభినందించారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ



పి.గన్నవరంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్‌ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షుడు దివంగత అడ్డగళ్ల పుల్లారావు గ్రామానికి, రైతులకు అందించిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ చైర్మన్‌ విప్పర్తి వేణుగోపాలరావు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఆయన కుమారులు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అడ్డగళ్ల వెంకటసాయిరామ్‌, సొసైటీ మాజీ అధ్యక్షుడు నానాజీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అడ్డగళ్ల పుల్లారావు మెమోరియల్‌ ట్రస్టును ఆదివారం విప్పర్తి, కొండేటి ప్రారంభించారు. ట్రస్టు ఆధ్వర్యంలో వారు పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పుల్లారావు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు జక్కంపూడి తాతాజీ, మట్టా శైలజ, అడ్డగళ్ల శ్రీను, సాధనాల రమేష్‌, పుచ్చకాయల నర్సింహమూర్తి, నాగవరపు నాగరాజు, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాతృ వియోగంతో బాధపడుతున్న పి.గన్నవరానికి చెందిన ఏపీ స్టేట్‌ స్పెషల్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ కమాండెంట్‌ కొండా నర్సింహారావును, అయన తండ్రి రామారావును జెడ్పీ చైర్మన్‌ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు పరామర్శించారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

- ఈనెల 14న ఆటో ప్రమాదంలో భార్య మృతి
- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న కూతురు
- ఆమెను చూసేందుకు వెళుతుండగా ఘటన

యానాం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూతురిని చూసేందుకు వెళ్లి తండ్రి. లారీ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తాళ్లరేవు – యానాం 216 జాతీయ రహదారిలో ఈ నెల 14న జరిగిన ప్రమాదంలో యానాం బాలయోగి నగర్‌కు చెందిన బూడపనీటి సత్యవేణి మృతి చెందగా, ఆమె కుమార్తె బూడపనీటి ప్రభావతి తీవ్రంగా గాయపడి కాకినాడలో ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో కూతురిని చేసేందుకు వెళుతున్న తండ్రి వెంకట రమణను కాకినాడలోని మెడికోవర్‌ ఆసుపత్రి వద్ద ఆదివారం రాత్రి లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన వెంకట రమణను అదే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒక పక్క భార్య మృతి చెందడం, కూతురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో మళ్లీ అదే కుటుంబంలో తండ్రి ప్రమాదానికి గురవడం అందరికీ కలిచి వేసింది.